www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 27 ఆగస్టు 2025
8 పేజీలు

ఏలూరు
పశ్చిమ గోదావరి

పండుగకు ధరాఘాతం..!



రైతుబజార్‌లో నిత్యావసర వస్తువుల ధరల పట్టిక

- నిత్యావసరాల ధరలతో సామాన్యులు విలవిల
- పప్పుల ధర కిలో రూ.వంద నుంచి రూ.120 పైనే
- వంటనూనెల ధర లీటర్ రూ.150
- గ్యాస్ సిలిండర్ ధర రూ.900కు చేరిక
- పిండి వంటలకు సామాన్యులు దూరం
- సామాన్యుల ఇళ్లలో కొరవడిన వినాయకచవితి కళ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్యుల ఇళ్లలో వినాయక చవితి పండుగ ఆనందం లేకుండా పోయింది. ధరల పెరుగుదలతో పండుగలకు సామాన్య ప్రజానీకం దూరమవుతున్న పరిస్థితి. నిత్యావసర వస్తువుల ధరలతోపాటు ప్రజలు వినియోగించే అన్ని వస్తువుల ధరలు అందనంత ఎత్తుకు చేరిపోయాయి. వినాయక చవితి వచ్చిందంటే కుడుములు, పరామన్నం, ఉండ్రాళ్లు, బూరెలు, గారెలు ఇలా అనేక పిండి వంటలను జనం చేసుకునేవారు. బంధువులకు, చుట్టుపక్కల వాళ్లకు పిండివంటలు అందించి ఆనందించేవారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అటువంటి పరిస్థితి కనుమరుగవుతోంది. వస్తువులపై జిఎస్‌టి భారీగా వేయడంతో ధరలు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. పిండి వంటలకు ముఖ్యంగా అవసరమయ్యే పప్పుల ధరలతోపాటు వంట నూనె, వంట గ్యాస్ ధరలు సైతం ఆకాశాన్నంటుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. కులమతాలకు అతీతంగా వినాయక చవితిని జరుపుకుంటారు. ప్రతి వీధిలోనూ వినాయక ప్రతిమను నిలబెట్టి పూజలు చేసి, నిమజ్జనం చేస్తారు. పిండి వంటలు వండుకుని ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటారు. అన్నసమారాధనలు సైతం పెద్దఎత్తున నిర్వహిస్తారు. ధరల పెరుగుదలతో పరిస్థితి మొత్తం పూర్తిగా మారిపోయింది. మార్కెట్లో కిలో కందిపప్పు ధర రూ. 120కు చేరగా, గారెలకు ఉపయోగించే మినపప్పు ధర కిలో రూ.105, బూరెలకు ఉపయోగించే పచ్చి శెనగపప్పు ధర కిలో రూ.95, వంటల్లో ఉపయోగించే ఎండు

..6లో

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలి

జిల్లా విస్తృత సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాట్లాడుతున్న బలరాం

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని, ప్రజల హక్కులను పరిరక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ జిల్లా విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన స్థానిక ఉద్ధరాజు రామం భవనంలో జరిగింది. సమావేశానికి జిల్లా నలుమూలల నుండి సిపిఎం నాయకులు, కార్యకర్తలు హాజ రయ్యారు. సమావేశంలో పలు ప్రజాసమస్యలపై తీర్మానాలు చేశారు. ముఖ్యవక్తగా విచ్చేసిన బలరాం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసగిస్తుందని, ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరిస్తుందని అన్నారు. దీన్ని సిపిఎంగా తీవ్రంగా ఖండిస్తు న్నామన్నారు. విశాఖ ఉక్కు ప్రయి వేటీకరణను వెంటనే ఆపాలని, కేంద్ర ప్రభుత్వ

..6లో

ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన కలెక్టర్ చదలవాడ నాగరాణి

ఉన్నత విలువలు ప్రజాశక్తి సొంతం

ప్రజాశక్తి 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

మారుతున్న కాలానికి అనుగుణంగా మంచి వార్తలు ప్రచురిస్తూ ఉన్నత విలువల పత్రికగా ప్రజాశక్తి

..6లో

పెదఅమిరంలో కలెక్టరేట్ నిర్మాణాన్ని అడ్డుకోవద్దు 8లో..

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా దేవానంద్‌కుమార్

తీరు మారని అధికారి ! 3లో..



ఆదర్శప్రాయులు మదర్‌థెరిస్సా

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్నా అని, సేవ చేసిన మదర్ థెరిస్సా అందరకీ ఆదర్శమని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా చింతలపూడి ఎంఎల్‌ఎ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పుష్పాలు వేసి నివాళులర్పించారు.

ఉంగుటూరు : మథర్ థెరిస్సా జయంతిని నారాయణపురంలో నిర్వహించారు. థెరిస్సా విగ్రహానికి ఎంపిటిసి సభ్యులు, ఛాంబర్ మండలాధ్యక్షుడు బండారు నాగరాజు, నారాయణపురం-2 ఎంపిటిసి సభ్యులు అరివెల్లి మహాలక్ష్మి దానయ్య నివాళులర్పించి ఆమె చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పిఎంపి సత్యనారాయణ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం :మదర్ థెరీస్సా జయంతి సందర్భంగా కొయ్యలగూడెం కొవ్వూరు రోడ్డులో స్మైల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్మైల్ ఆర్గనైజేషన్ అధ్యక్ష కార్యదర్శులు బొబ్బర మంగరాజు, పూలపల్లి రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సురక్ష హాస్పిటల్ అధినేత కొండముది దిలీప్‌కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి విజయ, చినబాబు, సర్పంచి, ఎస్‌సి కాలనీ ప్రెసిడెంట్ బొబ్బర చిట్టిబాబు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు.

నిత్యావసరాలు, మందులు అందిస్తున్న విద్యార్థులు

'మానస' విద్యార్థుల సేవాగుణం

ప్రజాశక్తి - భీమడోలు

మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు పలువురి ప్రశంసలు పొందాయి. పదో తరగతి విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి కొంత విరాళాలను పోగు చేశారు. దీంతో వివిధ రకాల ఇబ్బందులు పడుతున్న 50 మంది నిరుపేదలకు దుస్తులు, దుప్పట్లు, అత్యవసర మందులు, బిస్కెట్లు, నిత్యవసరాలు, భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్‌తో పాటు పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు రేవతీ దేవి, సిహెచ్.దేవి, లావణ్య, కవిత పాల్గొన్నారు.

రూ.11 లక్షల ఎల్‌ఒసి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నిరుపేదల పూర్తి ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. నాలుగు కుటుంబాలకు కేవలం గంటలో సుమారు రూ.11 లక్షల సిఎం సహాయ నిధి ఎల్‌ఒసి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. పేదల మెరుగైన వైద్యానికి గొప్ప వరం సిఎం సహాయ నిధి అన్నారు.

రైతులకు ఎరువులు అందించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మొలకల సత్యనారాయణ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ వారం రోజులుగా రైతులు ఎరువుల సమస్యను ప్రభుత్వానికి తెలియజేస్తున్నా పరిష్కారం లభించడం లేదన్నారు. ఇప్పటికే కొత్త సీజన్ పనులు మొదలవుతున్న తరుణంలో ఎరువుల కొరత రైతులకు పెద్ద భారంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతుల తరపున పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

వాయు కాలుష్య రహిత ఏలూరుకు కృషి

నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎయిర్ పొల్యూషన్ లేని నగరంగా ఏలూరును తీర్చిదిద్దడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ పొల్యూషన్ పిలుపులో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య ఆదేశాలతో నగరంలో అన్ని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిరంతర ప్రక్రియగా జరుగుతుందన్నారు. స్థానిక పాత బస్టాండ్ నుంచి తూర్పు లాకుల వరకు గూడ్స్ షెడ్ రోడ్డు కృష్ణ కాల్వ వెంబడి మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం మేయర్ నూర్జహాన్ పెదబాబు ప్రారంభించారు. కాల్వ వెంబడి ఇరువైపులా 600 మొక్కలు అవసరమవుతాయని గుర్తించామన్నారు. డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ మాట్లాడుతూ ఎయిర్ పొల్యూషన్ నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు చోడే వెంకటరత్నం, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆర్‌ఎన్‌ఆర్ నాగేశ్వరరావు, డివిజన్ ఇన్‌ఛార్జి దాకారపు రాజేశ్వరరావు, కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, ఎంఇ సురేంద్రబాబు, డిఇ అప్పలరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు, విలువలే కొలమానంగా అభివృద్ధి కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం సమప్రాధాన్యతా క్రమంలో ముందుకు తీసుకెళ్తుందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి చెప్పారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా విని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఎల్‌ఎను నగరంలో గణేష్ ఉత్సవ మండపాలకు చెందిన కమిటీల సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి గణేష్ చతుర్థి వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నా. సమస్యలన్నింటికీ భవిష్యత్తులో శాశ్వత పరిష్కారాలు చూపనున్నట్లు ఆయన భరోసా కల్పించారు.

ప్రభుత్వాసుపత్రికి వీల్‌చైర్లు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా సర్వజన ఆసుపత్రికి రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా వీల్ చైర్లు అందించడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు అన్నారు. ఏలూరు సర్వజన ఆసుపత్రిలో వీల్ చైర్ల కొరత ఉన్న కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.60 వేల విలువైన పది వీల్ చైర్లను జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు అందించారు. ఈ సందర్భంగా బెన్నీ మాట్లాడుతూ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిత్యం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జునరావు, రెడ్‌క్రాస్ సభ్యులు కడుపు కన్నయ్య, ఎ.సూర్యనారాయణ, రెడ్ క్రాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ వి.నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్లు అందిస్తున్న రెడ్ క్రాస్ సిబ్బంది

రియాన్ష్‌కు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ గుండె వైద్యులు కొల్లూరు లక్ష్మణ్ కుమారుడు కొల్లూరు రియాన్ష్ చిన్న వయసులో జాతీయస్థాయిలో అరుదైన గుర్తింపు పొందారు. 101 కౌరవుల పేర్లు అతి తక్కువ సమయం 48.10 సెకండ్‌లో అనర్గళంగా వేగంగా కచ్చితత్వంతో చెప్పి అరుదైన జాతీయస్థాయి రికార్డుని నెలకొల్పాడు. ఇప్పటిదాకా ఈ విభాగంలో ఉన్న రికార్డులను ఛేదించి అతి చిన్న వయసు, అతి తక్కువ సమయంలో చెప్పడం ద్వారా అరుదైన నూతన రికార్డును స ష్టించాడు. హర్యానాకు చెందిన ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ కొల్లూరు రియాన్ష్ ప్రతిభను గుర్తించి ఆగస్టు 21వ తేదీన అధికారిక ప్రకటన చేసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సూపర్ హీరో గుర్తింపును ఇచ్చింది. తమ కుమారుడికి చిన్న వయసులో జాతీయ గుర్తింపు లభించడం ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్, డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సైతం అసాధారణ ప్రతిభ విభాగంలో గుర్తింపు లభించిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని రికార్డ్స్ సాధించడానికి ప్రోత్సహిస్తామని తెలిపారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యార్థులు విద్యతో పాటు జీవనోపాధికి దోహదపడే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఆర్ఆర్ బాలుర హై స్కూల్ హెచ్ఎం డివిఎల్.పుష్పలత అన్నారు. పాఠశాలకు చెందిన తొమ్మిది, పదో తరగతిలో ఉన్న ఒకేషనల్ అగ్రికల్చర్ విద్యార్థులు ఒకేషనల్ ఉపాధ్యాయుడు వై.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా నూజివీడుకు దగ్గరలో ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను సందర్శించారు. అక్కడ ఫర్టిలైజర్ టెస్టింగ్, సీడ్ జెర్మినేషన్, సాయిల్ టెస్టింగ్ తదితర విషయాలపై అగ్రికల్చర్ అసిస్టెంట్ అవగాహన కల్పించారు. ఉపాధిని కల్పించే కార్యక్ర మాలపై అవగాహన కలిగించేందుకు ఇలాంటి క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నట్లు హెచ్ఎం పుష్పలత అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, ధారావత్ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

వ్యాధుల నిర్మూలనకు కృషి అవసరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

వ్యాధుల నిర్మూలనలో మగ ఆరోగ్య కార్యకర్తల పాత్ర చాలా కీలకమైందని, ఆరోగ్య కార్యకర్తలు కష్టపడి పనిచేసి వైద్యారోగ్య శాఖకు మంచి పేరు తీసుకురావాలని డిఎంహెచ్ఒ డాక్టర్ పిజె.అమృతం సూచించారు. స్థానిక ఏలూరు వైద్యారోగ్య శాఖ సమీక్ష సమావేశ మందిరంలో మగ ఆరోగ్య కార్యకర్తలకు ఒకరోజు ఓరియంటేషన్ ట్రైనింగ్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలియో, మశూచి బోదకాలు, కలరా తదితర వ్యాధుల నిర్మూలనలో మగ ఆరోగ్య కార్యకర్తల పాత్ర కూడా ఉందని తెలిపారు. భవిష్యత్తులో మలేరియా నిర్మూలన, డెంగీ జ్వరాల నిర్మూలన కీలక పాత్ర పోషించాలని, ముఖ్యంగా దోమల ద్వారా, నీళ్ల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టడంలో క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ డెంగీ, మలేరియా వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, వాడే మందుల గురించి, దోమల నిర్మూలనకు తీసుకునే చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, పందిరి శ్రీనివాసరావు, జిల్లా పరిధిలోని సబ్ యూనిట్ అధికారులు, హెల్త్ సూపర్‌వైజర్స్ 110 మంది మగ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

శాంతి భద్రతలను కాపాడాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గించేవారిని ఉపేక్షించొద్దని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులకు సూచించారు. పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరావు, సిఐలు, ఎస్‌ఐలు ఎంఎల్‌ఎను బర్రింకలపాడు క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతిభద్రతలపై చర్చించారు. ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతలను కాపాడాలన్నారు. ఉత్సవాల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సిఐలు బి.వెంకటేశ్వరావు, బాల సురేష్, రమేష్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐ జయబాబు, చంద్రశేఖర్, క్రాంతికుమార్, నవీన్, మహేశ్వరరావు, పవన్, రాజారెడ్డి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి

డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేయాలని పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సబ్ డివిజన్ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్‌ల పరిధిలో ఇటీవల నమోదైన కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు, పోలవరం సిఐ బాలసురేష్, కుక్కునూరు సిఐ ఎం.రమేష్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొర్లకుంటలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని కొర్లకుంట గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి అక్కినేని చాముండేశ్వరి ఆధ్వర్యంలో పకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు రసాయనిక ఎరువులు, వాటి వాడకం గురించి వివరించారు. పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని సిద్ధార్థ నగర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానల్ న్యాయవాది జాన్‌బాబు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఆడపిల్లకు 18 సంవత్సరాలు, మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయకూడదన్నారు. వయసు నిండకుండా వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్య వివాహం చేస్తే శిక్షలు కఠినంగా ఉంటాయని వివరించారు. పోక్సో బాలల హక్కులపై అవగాహన కల్పించారు.

రాయితీపై డ్రోన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

రైతులు మారుతున్న కాలాలకి అనుగుణంగా యాంత్రీకరణ పరికరాలతో సాగు చేయడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని ఉంగుటూరు ఎంఎల్‌ఎ ధర్మరాజు అన్నారు. ఉంగుటూరు, గోపీనాథపట్నాలకు చెందిన ఇద్దరు రైతులకు రాయితీపై డ్రోన్లు అందించారు. ఈ పథకంలో డ్రోన్ విలువ రూ.9.80 లక్షలు కాగా రాయితీ రూ.7.80 లక్షలుగా ఉన్నాయి. రైతుల గ్రూపు రూ.రెండు కట్టాలి. తహశీల్దార్ మాట్లాడుతూ రైతులందరూ ఆధునీకత వైపు మారాలని తెలిపారు.

తీరు మారని అధికారి..!

మండల విద్యాశాఖకు అప్రతిష్ట

ఎంఎల్ఎ హెచ్చరికలతోనైనా గాడిన పడేనా

జిల్లా అధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల విద్యా శాఖాధికారి తీరు మారడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఎంఇఒ-2 వ్యవహార తీరుపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రంగాపురం పాఠశాలలో బోగస్ రోల్ ఉందని తెలిసినా కేవలం సదరు అధికారి అండో, లేక ప్రోద్బలమోగాని ఆ పాఠశాల హెచ్ఎం భవిత విద్యార్థుల పేర్లు రోల్‌లో కొనసాగించడమే దీనికి నిదర్శనమని పలువురు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం రంగాపురం కేంద్రంగా ఎంఇఒ విధులు నిర్వహించడమే కారణమని తెలుస్తోంది. రంగాపురంలో ఉదయాన్నే ఎంఆర్‌సి భవనం వద్ద ఇ-హాజరు వేసి, ఇక విధులన్నీ అక్కడి నుంచే నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. ఆఫీస్ సిబ్బంది వద్ద నుంచి ఉపాధ్యాయుల వరకూ అంతా రంగాపురం పాఠశాల బాట పట్టాల్సి వస్తుందంటే అతిశయోక్తి కాదు. ఎవరైనా ఇదేమిటని నిలదీస్తే ఉపాధ్యాయ సంఘాల నేతలను రంగంలోకి దించి ఎదురు దాడి చేయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చిరుగుకోట నరసన్నపాలెం కేంద్రంగా సదరు అధికారి పలు వివాదాస్పద కార్యక్రమాలకు తెరలేపగా ఎంపిపి హెచ్చరించినా పట్టించుకోలేదనే ప్రచారం ఉంది. దీంతో అప్పటి ఎంఎల్ఎ ఇన్‌ఛార్జి ఎంఇఒ బాధ్యతల నుంచి తప్పించగా, ప్రస్తుతం రెగ్యులర్ ఎంఇఒగా నియమితులై అదే పంథా కొనసాగిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. సదరు అధికారి ఒక పాఠశాలను ఇతర కార్యక్రమాలకు వేదికగా చేసుకుంటున్నారని, దానికి ఆ పాఠశాల బయట ఆయాను కాపలా ఉంచుతున్నారని తెలుస్తోంది. ఆ సమయంలో ఎవరు ఆ పాఠశాలకు వెళ్లినా ఆయా అనుమతి లేనిదే లోనికి అడుగులు పెట్టడం అసాధ్యమని ప్రచారం ఉంది. ఇటీవల ఎంఇఒ-1 సదరు స్కూల్ సందర్శనకు వెళ్లగా ఆయనను సైతం ఆయా అడ్డుకున్నారంటే ఎంఇఒ-2 తీరు ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆయన విధులు నిర్వహించడం కన్నా, ఆట పాటలతో కాలక్షేపం చేస్తూ అనేక మంది ఉపాధ్యాయులను తనతో తిప్పుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కనీసం ఆ శాఖ జిల్లా అధికారుల నుంచి ప్రజాప్రతినిధుల వరకూ ఎవరూ ఫోన్ చేసినా స్పందించే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఈయనపై ఎన్ని ఆరోపణలు వచ్చినా ముడుపులు ముట్టజెప్పి ఉన్నతాధికారుల నుంచి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. నూతన బదిలీ విధానంపై పరిశీలనలో భాగంగా ప్రజాశక్తి మండలంలోని పలు పాఠశాలల్లో రోల్, హాజరు పరిశీలించగా చాలా వ్యత్యాసం కన్పించింది. దీనిపై పర్యవేక్షణ చేయాల్సిన సదరు అధికారుల నిర్లక్ష్య వైఖరి ఫలితమే దీనికి కారణమని తెలుస్తోంది.

ఎంఆర్‌సి భవనం

ఎంఇఒ-2 వైఖరిపై ఎంఎల్ఎ సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పరిస్థితి ఉంది. యుపి పాఠశాలలను డీగ్రేడ్ చేయటం, గ్రామీణ ప్రాంత విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సరి కాదని ఎంఎల్ఎ ఆయనను హెచ్చరించారు. ఇలాంటి అధికారి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదని స్పష్టం చేయారు. ఇక్కడ నుంచి సెలవు పెట్టుకుని వెళ్లిపోవాలని, లేనిపక్షంలో ప్రభుత్వానికి సరెండర్ చేయిస్తానని హెచ్చరించారంటే సదరు అధికారి వైఖరి ఏస్థాయిలో వివాదాస్పదమవుతోందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై జిల్లా అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి - కైకలూరు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికంగా ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గోపి, బొడ్డేపల్లి చంద్రశేఖర్ మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. ఎన్నికల హామీల్లో భాగంగా జిఒ నెం.21 రద్దు చేస్తామని, ఆటో డ్రైవర్ల కుటుంబాలకు భరోసా కల్పించేలా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలను కూటమి విస్మరించిందని విమర్శించారు. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.పది వేలు ఇచ్చిందని, తాము అధికారంలోకొస్తే రూ.15 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. సంవత్సరానికి రూ.25 వేలు ఇచ్చి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశా రు. మడక శ్రీనివాసరావు, అడపా జానీ, గజ్జల తంబి, వీరంకి శివయ్య, మడిచర్ల సింహాచలం, గోశాల అనిల్, ఒంద్రుపల్లి సుధాకర్, మడక శ్రీనివాసరావు కార్యక్రమానికి నాయకత్వం వహించారు. అనంతరం తహశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

కైకలూరులో...

కుక్కునూరు రూరల్: ఉచిత బస్సు వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు రూ.25 వేలు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్రం సాయికిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆటో డ్రైవర్ల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో కుక్కునూరు ప్రధాన సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి సాయికిరణ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఉచిత బస్సుకు వ్యతిరేకం కాదని, అయితే దాని వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. కుక్కునూరు మండల కేంద్రంలో పికపింగ్, డ్రాపింగ్ పాయింట్ లేకపోవడంతో ఆటోలు పార్క్ చేసుకోవడానికి కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పార్కింగ్ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆటో యూనియన్ అధ్యక్షులు పోచారపు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి దార కృష్ణ, లారీ యూనియన్ కార్యదర్శి మహమ్మద్ వలీపాషా, ఓగిరాల నాగరాజు ఆటో డ్రైవర్లు గోపి, రాము, సాగర్, వీరయ్య, దుర్గయ్య, అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో...

పోలవరం: మహిళలకు ఉచిత బస్సు వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు పోలవరం శ్రీ చైతన్య ఆటో యూనియన్ కార్మికులు మంగళవారం స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో భిక్షాటన, వంటా వార్పు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ కార్మికులు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు తాళ్లపూడి చంద్రరావు, నేతలు సబ్బారావు శ్రీను, ముత్యాల వెంకన్న, కొత్తపల్లి నాగరాజు, రాంబాబు, రాజు, బాజీ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ

ముసునూరు :ప్రత్యేక అవసరాల పిల్లలు ప్రతిరోజూ తప్పనిసరిగా వ్యాయామం చేస్తే ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి అన్నారు. మండలంలోని రమణక్క పేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఇఆర్‌పి ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ రావు, జె.నాగమల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ముసునూరు: అల్పపీడనం ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాలతో పాటు పలుచోట్ల వర్షాలు కురుస్తాయని మండల పరిధిలోని 16 గ్రామాల ప్రజలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ పురుషోత్తమశర్మ తెలిపారు. ఇప్పటికే పలుచోట్ల వర్షాలు కురుస్తుండడంతో తమ్మిలేరు పరివాహక ప్రాంతాలైన ఎల్లాపురం, బలివే, వెంకటాపురం, గుడిపాడు, గుల్లపూడి, లోపూడి గ్రామాల ప్రజలు తమ్మిలేరు ప్రాంతంలోకి వెళ్లకూడదని సూచించారు.

పోరాటాలతోనే కార్మిక హక్కుల పరిరక్షణ

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నాగమణి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్య పోరాటాల ద్వారానే ఎదుర్కోవాలని, లేబర్ కోడ్స్ రద్దు కోసం ఉద్యమించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మెండెం నాగమణి తెలిపారు. ముదినేపల్లిలో మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం అరుణకుమారి అధ్యక్షతన నిర్వహించిన సిఐటియు మండల మహాసభలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వాలు కష్టించి పనిచేసే వారికి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఉచిత బస్సు పేరుతో ఆటో వర్కర్ల కుటుంబాలను రోడ్డున పడవేశారని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి వాటి నిధులను పక్కదారి పట్టించడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలకు సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఆటో వర్కర్లకు వాహన మిత్ర ద్వారా రూ.25 వేలు అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళీరావు మాట్లాడారు. అనంతరం సిఐటియు నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ కన్వీనర్‌గా పద్మ, కో కన్వీనర్‌గా విజయలక్ష్మి, అరుణ, నాగబాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జక్కుల మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిన్న మాధవ విజయలక్ష్మి, రిబ్కా, నిరోషి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగమణి

సమస్యల పరిష్కారానికి కృషి : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ ఉపాధ్యాయుల పిఎఫ్ పాక్షిక, పూర్తి ఉపసంహరణ విషయంలో రాష్ట్ర అధికారులతో మాట్లాడి త్వరలోనే ఓ కొలిక్కి తీసుకొచ్చేలా ప్రయత్నిస్తామని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర జెఎసి జనరల్ సెక్రటరీ కెఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక యుటిఎఫ్ కేంద్ర కార్యాలయంలో నగర శాఖ అధ్యక్షురాలు షేక్ పర్వీన్ బేగం అధ్యక్షతన యుటిఎఫ్ నగర శాఖ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిని, ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి షేక్ ముస్తఫా అలీ, రుద్రాక్షి రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పలు అంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రంగమోహన్, ఆడిట్ కన్వీనర్ బంటు మోహన్, జిల్లా కార్యదర్శులు సుధారాణి, కమల్, నగర శాఖ కార్యదర్శి ఈడే శివశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

వీరప్పచెరువులో దారుణం

భార్య టార్చ్‌లైట్‌తో తలపై కొట్టడంతో భర్త మృతి

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

భార్యాభర్తల మధ్య తలెత్తిన గొడవ హత్యకు దారి తీసింది. టార్చ్‌లైట్‌తో భర్త తలపై కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని కొటాలపర్రుశివారు వీరప్పచెరువులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరప్పచెరువు గ్రామానికి చెందిన కౌరు వెంకటనారాయణ(48)కు సుమారు 28 ఏళ్ల క్రితం వివాహమైంది. వివాహమైన కొన్నేళ్లకు ఆయన భార్య మృతి చెందింది. దీంతో అత్తిలి మండలం కొమ్మరకు చెందిన అనంతలక్ష్మి (బేబీ సరోజినీ)ని రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటనారాయణ జీవనోపాధి నిమిత్తం గతంలో దుబాయ్ దేశం వెళ్లి కొంతకాలం అక్కడ ఉండి వచ్చాడు. అనంతరం సుమారు ఆరు నెలల క్రితం మళ్లీ దుబాయ్ దేశం వెళ్లి సుమారు వారం రోజుల క్రితం తిరిగి ఇంటికి వచ్చారు. వెంకటనారాయణ ఇంటికొచ్చినప్పటి నుంచి అతనికి, అతని భార్య అనంతలక్ష్మికి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ రాత్రి 11:30 గంటల సమయంలో ఇద్దరి మధ్య గొడవైంది. ఇద్దరు ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఆ సమయంలో అనంతలక్ష్మి పక్కనే ఉన్న ఇనుప టార్చ్ లైట్‌తో వెంకటనారాయణ తల వెనుక భాగంలో బలంగా కొట్టడంతో తీవ్ర గాయమై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు వెంకటనారాయణ మేనల్లుడు గుబ్బల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కూల్‌డ్రింక్స్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

బైకును కూల్‌డ్రింక్స్ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ గంగాధరరావు తెలిపిన వివరాల ప్రకారం... మునమర్రు గ్రామానికి చెందిన తానేటి సత్యానందం (37) మంగళవారం మధ్యాహ్నం బైక్‌పై పెరవలి బయదులేరాడు. ఈ క్రమంలో పెనుగొండలోని ఇండియన్ గ్యాస్ గొడౌన్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వచ్చిన కూల్ డ్రింక్స్ వ్యాన్ సత్యానందాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సత్యానంతం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ముదినేపల్లి

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పెయ్యేరు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం పెయ్యేరు గ్రామానికి చెందిన కోటే రాజు(32) సోమవారం అర్ధరాత్రి పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో ఇంట్లో పడి ఉండగా కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తలకు మనస్పర్థలు ఏర్పడడంతో వేర్వేరుగా ఉంటున్నారు. భార్య కాపురానికి రాకపోవడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తాళలేని రాజు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని వాండ్రం గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి పోలీసులు తెలిపారు.

సొసైటీలు ప్రగతి పథంలో దూసుకుపోవాలి

కోఆపరేటివ్ సొసైటీల అసిస్టెంట్ రిజిస్ట్రార్ మహమ్మద్ ముజిబూర్ రెహమాన్

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆశీస్సులతో నూతన త్రిసభ్య కమిటీలు, ఆయా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ప్రగతి పథంలో దూసుకుపోవాలని కో ఆపరేటివ్ సొసైటీల అసిస్టెంట్ రిజిస్ట్రార్, మండల్ లెవెల్ అధికారి మహమ్మద్ ముజిబూర్ రెహమాన్ అన్నారు. ఆయన ప్రజాశక్తిలో మాట్లాడారు.

ప్రశ్న: మండలంలో సొసైటీల కార్యకలాపాల గురించి చెప్పండి?

రెహమాన్ : ఆయా సొసైటీల్లో సభ్యులుగా ఉన్న రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన అన్ని కార్యక్రమాలూ నిర్వహిస్తాం.

ప్రశ్న : సొసైటీల్లో రైతులకు మీరందించే సేవలేంటి?

రెహమాన్ : పంట, పశు రుణాలు, టూ వీలర్స్ కోసం రుణాలు, లాండ్ డెవలప్ మెంట్ తదితర రైతులకు అవసరమైన రుణాలు ఇస్తాం. పంటల బీమా, ఫసల్ బీమా, రైతు నేస్తం, రైతు బంధు వంటి పథకాలు వర్తింపజేస్తాం. ఎరువులు, పురుగు మందుల విక్రయాలు నిర్వహిస్తాం.

ప్రశ్న : రైతుల ప్రగతికి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారా?

రెహమాన్ : పొలమూరు సొసైటీలో 2016లో అప్పట్లో మంత్రి పితాని సత్యనారాయణ ప్రారంభించిన పాల సేకరణ కేంద్రం నేటికీ పాడి రైతులకు, వినియోగదారులకు చక్కని సేవలందిస్తోంది.

ప్రశ్న : సొసైటీల పరిధిలో ఎన్ని ఆర్ఎస్‌కె కేంద్రాలు ఉన్నాయి?

రెహమాన్ : సుమారు 15 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. అలాగే పెనుమంట్రలో ఒక డిసిఎంఎస్ బ్రాంచి ఉంది.

ప్రశ్న: సొసైటీల్లో డిపాజిట్ల సేకరణ ఎలా ఉంది?

రెహమాన్ : అన్ని సొసైటీల్లో నిరంతరం డిపాజిట్ల సేకరణ జరుగుతోంది. ఆలమూరు, మాముడూరు సొసైటీల్లో మెరుగైన ప్రగతి ఉంది.

ప్రశ్న : సొసైటీల్లో ఫసల్ బీమా పూర్తయ్యిందా?

రెహమాన్ : మండలంలోని కొయ్యేటిపాడు, సత్యవరం, పొలమూరు, జుత్తిగ, ఎస్ఐ.పట్రు, మాముడూరు సొసైటీల్లో నూరు శాతం పూర్తయ్యింది. మిగిలిన సొసైటీలు ఆ దిశగా సాగుతున్నాయి.

ప్రశ్న : పైఅధికారుల సహకారం ఎలా ఉంటుంది?

రెహమాన్ : జిల్లా సహకార అధికారి సంకు మురళీకృష్ణ, డివిజన్ సహకార అధికారి ఆరుమిల్లి శ్రీనివాస్ సంపూర్ణ సహకారం ఉంది.

ఆగర్రు సొసైటీ ఛైర్మన్‌గా జాన్ డేవిడ్‌రాజు

జాన్ డేవిడ్ రాజును అభినందిస్తున్న యువత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు మండలం ఆగర్రు సొసైటీ ఛైర్మన్‌గా మేడిది జాన్ డేవిడ్‌రాజు, పర్సన్లుగా పెన్మత్స సూర్యనారాయణరాజు, పోలినాటి నాగేశ్వరరావు మంగళవారం ఆగర్రులో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి అధ్యక్షులు పాముల రజనీకుమార్ అధ్యక్షత వహించారు. ఛైర్మన్‌గా ఎన్నికైన జాన్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ గతంలో ఈ సొసైటీకి ప్రస్తుతం నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఛైర్మన్‌గా వ్యవహరించారు. అటువంటి సొసైటీకి తనను ఛైర్మన్‌గా ఎంపిక చేసిన మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా రుణాలు, ఎరువులు, వారికి కావాల్సిన వ్యవసాయ పనిముట్లు అందజేసే విధంగా కృషి చేస్తానని, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, ఎఎంసి ఛైర్మన్ కోడి విజయభాస్కర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జనసేన నాయకులు తుల రామలింగేశ్వరరావు, బిజెపి నాయకులు కబర్ది, ఇంటి శ్రీరాములు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ఎంపిటిసి మామిడిశెట్టి లలిత కుమారి, బిజెపి జనసేన నాయకులు హాజరయ్యారు.

గణపవరాన్ని పశ్చిమలో కొనసాగించాలని వినతి

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కొనసాగించాలని కెవిపిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ వైకెవి.అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నంచిన నాగేశ్వరరావు మాట్లాడుతూ మాట్లాడుతూ అడ్మినిస్ట్రేషన్ సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండాలని ఏలూరు జిల్లాలోని గణపవరం మండలాన్ని ప్రజల విజ్ఞప్తుల మేరకు జిల్లాలో కలపడం జరిగిందని తెలిపారు. ఈ మండలాన్ని పశ్చిమగోదావరిలో కొనసాగిస్తూ ఏలూరులో జిల్లాలో కొనసాగుతున్న పోలీస్ వ్యవస్థను పశ్చిమగోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పరిధిలోకి కూటమి ప్రభుత్వం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వరధరాజపురం గ్రామ సర్పంచి గుర్రం సుబ్బారావు, కట్టురి ప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా నిత్యావసరాల పంపిణీ : ఎంఎల్ఎ ఆరిమిల్లి

తణుకు:రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులు పారదర్శకంగా పంపిణీ చేయడానికి స్మార్ట్ రైస్‌కార్డులు ఉపయోగపడతాయని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం మండపాకలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్యూఆర్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఎటిఎం కార్డు తరహాలో ఉండే ఈ స్మార్ట్‌రైస్ కార్డులో ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా కుటుంబ సభ్యుల వివరాలు తెలుస్తాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి ప్రతిచోటా తన ఫొటో ఉండాలని కోరుకునేవాడిని అన్నారు. రేషన్‌కార్డులతో పాటు పట్టాదారు పుస్తకాలపై జగన్ బొమ్మలు వేయడంతో పాటు గ్రామాల్లో సరిహద్దు రాళ్లపైన ఆయన చిత్రాలు ముద్రించుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పిచ్చి చేష్టలను అధిగమించి రాష్ట్ర ప్రజల గౌరవం ఉండే విధంగా ఇలాంటి కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. తణుకు నియోజకవర్గంలో 86 వేల కార్డులు అందించడం జరుగుతుందన్నారు. రాబోయే సెప్టెంబర్ నుంచి కొత్త కార్డుల ద్వారా బియ్యం పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ హితం కోసమే మట్టి విగ్రహాల తయారీ

ముదినేపల్లి:ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ హితం కోసం వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.రజిత అన్నారు. ముదినేపల్లి పశ్చిమ పాఠశాలలో మట్టితో గణపతి విగ్రహాలను మంగళవారం తయారు చేసే పనుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు నిమగ్నమయ్యారు. విద్యార్థులు ఆసక్తిగా వినాయక మట్టి విగ్రహాలు తయారు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుయిని ఎం.వెంకటలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కొవ్వలి పుట్టినరోజు వేడుకలు

నరసాపురం:కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. కొవ్వలి ఫౌండేషన్ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ నిమ్మకాయల గోపాలరావు, నీలిమ దంపతులు, సెక్రటరీ కొండా శ్రీధర్ చేతుల మీదుగా కేక్‌కట్ చేశారు. అనంతరం బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మిత్రుడు బండారు విశ్వమోహన్ కుమార్ ఆర్థిక సాయంతో లెప్రసీ కాలనీ వాసులకు భోజనాలు ఏర్పాటు చేశారు. సిఐ యాదగిరి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నలుమూలల నుంచి కొవ్వలి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రగతి పథంలో సొసైటీలు

ఆదర్శంగా నిలుస్తున్న పొలమూరు సహకార సంఘం

పొలమూరు సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పాల కేంద్రం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని తొమ్మిది సొసైటీలు ప్రగతి పథంలో ఉండగా వాటిలో పొలమూరు సొసైటీ పాలవెల్లువ పథకం అమల్లో ఆదర్శంగా నిలుస్తోంది. 1916లో ఏర్పడ్డ ఈ సొసైటీలో 2,440 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఆశీస్సులతో 2016లో ప్రారంభించిన పాల సేకరణ కేంద్రం ద్వారా పాడి రైతుల నుంచి ప్రతి రోజూ సేకరించిన సుమారు 100 లీటర్ల పాలను, తిరిగి అక్కడికక్కడే రెగ్యులర్ వినియోగదారులకు విక్రయించి ఆ వచ్చే దాయాన్ని సొసైటీకి జమ చేస్తారు.

పెనుమంట్ర సొసైటీ 1958లో ఏర్పడగా, ప్రస్తుతం 6,639 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఓడూరు, నెలమూరు గ్రామాలను చేర్చుకున్న ఆలమూరు సొసైటీ 1916లో ఏర్పడగా ఇందులో 649 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. కొయ్యేటిపాడు సొసైటీ 1932లో ఏర్పడింది. ఇందులో 452 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సోమరాజు ఇల్లింద్రపర్రు సొసైటీ 1919లో ఏర్పడగా ఇందులో 570 మంది సభ్యులు ఉన్నారు. జుత్తిగ సొసైటీ 1919లో ఏర్పాటు కాగా 398 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సత్యవరం సొసైటీ 1912లో ఏర్పాటు కాగా 713 మంది రైతులు సభ్యులుగా చేరారు. నెగ్గిపూడి, మార్టేరు సొసైటీ 1925లో ఏర్పడింది. వెలగలేరు సొసైటీలో 650 మంది సభ్యులు ఉన్నారు. ఆయా సొసైటీలు నిరంతరం రైతులకు సేవలందిస్తున్నాయి. త్రిసభ్య కమిటీల్లోని ఛైర్మన్లు, సభ్యులు, సొసైటీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది చేస్తున్న కృషితో సొసైటీలు మన్ననలు పొందుతున్నాయి.

వినాయక చవితికి ధరాఘాతం

ధరలు చూసి జనం బెంబేలు

పెనుమంట్ర : విక్రయానికి సిద్ధంగా ఉన్న పండ్లు, వినాయక ప్రతిమలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వినాయక చవితి పండుగ సందర్భంగా పండ్లు, పూలు తదితర అన్ని సామగ్రి ధరలూ మండిపోతున్నాయి. ధరలు చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. చిన్న వినాయక ప్రతిమ సైతం యాభై రూపాయలకు విక్రయిస్తున్నారు. గతంలో మట్టి అచ్చు ప్రతిమ పది రూపాయలు ఉండగా, ప్రస్తుతం ఇరవై రూపాయలు పలుకుతోంది. పండ్ల రకం ఏదైనా ఒక్కటీ ఇరవై రూపాయలు, చిన్న చెరకు ముక్క ఇరవై రూపాయలు, వినాయకుని గొడుగు సైతం ఇరవై రూపాయలకు విక్రయిస్తున్నారు. నాలుగు, ఐదు రకాల పత్రి కట్టా రూ.30, మామిడి ఆకుల కట్ట ఇరవై రూపాయలు పలుకుతోంది. పూల సంగతి అయితే చెప్పనవసరం లేదు. యాభై రూపాయలకు పాతిక పూలు రావడం లేదు. మూర లెక్కన కొనాలంటే అంతే సంగతులు. అన్ని ధరలూ చూసి జనం గగ్గోలు పెడుతున్నారు. కొబ్బరికాయ రూ.30, తమలపాకులు, అరటి ఆకులు సైతం అధిక ధరలు పలకడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.

ఏ డిపోనూ మూసివేసే ప్రసక్తే లేదు

ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకాతిరుమలరావు

తాడేపల్లిగూడెం:ఏ డిపోనూ మూసివేసే ప్రసక్తే లేదని ఎపిఎస్ ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెం ఆర్‌టిసి డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 129 డిపోల్లో ఏ డిపోనూ మూసివేసే ఆలోచన లేదని, అవసరమైతే ఇంకా అభివృద్ధి పర్చి ఇంకా ఎక్కువ డిపోలను పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి మహిళా ఉచిత బస్ పథకం అమలు తీరును వాటికి ప్రవేశపెట్టిన బస్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని కారణాల వల్ల డిపో మేనేజర్, రీజనల్ మేనేజర్ ప్రమోషన్లు ఆలస్యం అయ్యాయని, ప్రస్తుతానికి కొన్నిచోట్ల ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, సాధ్యమైనంత త్వరలో రెగ్యులర్ ప్రమోషన్లు ఇస్తామని తెలిపారు. ఆర్‌టిసి విశ్రాంతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తనను కలిసిన రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలకు హామీ ఇచ్చారు.

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు, కూటమి నాయకులకు ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆనందంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వ 15 నెలల పాలనలో అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనిస్తూ రైతులు, అన్ని వర్గాల ప్రజలూ సంతోషంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలందరూ సంతోషంగా కూటమి పాలనలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు.

మట్టి వినాయకుల పంపిణీ

నూజివీడు టౌన్: పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుని ప్రతిమకు పూజలు చేయాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ సూచించారు. పట్టణంలోని ఐదో వార్డులోని బొందిలిపేటలో గంగానమ్మ ఆలయం వద్ద మంగళవారం యాత్రికులకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏటా మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. పందిళ్ల వద్ద నిర్వహించే వినాయక నవరాత్రుల్లో కూడా సాధ్యమైనంత వరకూ మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలన్నారు. పట్టణ ప్రజలందరికీ ఈ సందర్భంగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

చవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజవకర్గంలో వినాయక చవితి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో మంగళవారం నుంచే పండుగ సందడి నెలకొంది. మార్కెట్ కటకలాడుతోంది. వేడుకలు ఘనంగా నిర్వహించడానికి స్వామివారి మండపాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద వినోద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. వినాయక చవితి సందర్భంగా మండలంలోని ఆచంట, వల్లూరు, ఆచంట వేమవరం, పెనుమంచిలి, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురం, కొడమంచిలి గ్రామాల్లో పూజా సామగ్రి, పండ్లు, తాత్కాలిక దుకాణాలు పెద్ద ఎత్తున వెలిశాయి. ఆచంట కచేరీ సెంటర్, వల్లూరి మార్కెట్ సెంటర్లో పూజా సామగ్రి స్టాల్స్ ప్రధాన రహదారులను ఆనుకుని ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగింది. చవితి సామగ్రి ధరలు బాగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మట్టి విగ్రహాలు మార్కెట్‌ను ముంచెత్తాయి. విగ్రహం సైజును బట్టి రూ.50 నుంచి రూ.200 వరకూ విక్రయిస్తున్నారు. ప్రజలు మట్టి విగ్రహాలపైనే మొగ్గ చూపారు.

స్టార్టప్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల తాడేపల్లిగూడెం బ్రాంచిలో బిఎస్‌సి ఎఐ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు ఎపి నిట్‌లో జరిగిన ఇన్‌స్పైరా టెక్నికల్ ఈవెంట్‌లో స్టార్టప్ ఆలోచనలలో మొదటి బహుమతి, రూ.5 వేల నగదు బహుమతి లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీ సరోజ తెలిపారు. స్టార్టప్ విజేతలను కళాశాల ఛైర్మన్ ఎన్.శేషా రెడ్డి, సెక్రటరీ ఎన్.సుగుణ రెడ్డి, స్థానిక డైరెక్టర్ కె.శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.

పోలీస్ యాక్ట్ 30 అమలు

డిఎస్‌పి జి.శ్రీవేద

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం సబ్ డివిజన్‌లో పోలీసులు ఆంక్షలు విధించారు. శాంతి భద్రతల దృష్ట్యా సబ్ డివిజన్ అంతటా పోలీస్ యాక్ట్ 30ని అమలు చేస్తున్నారు. ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకూ సబ్ డివిజన్ అంతా అమల్లో ఉన్నట్లు డిఎస్‌పి జి.శ్రీవేద వెల్లడించారు. ముందస్తు అనుమతి లేకుండా సబ్ డివిజన్‌లో ఎలాంటి బహిరంగ సమావేశాలు గానీ, ఊరేగింపులు, ధర్నాలు గానీ జరపకూడదని తెలిపారు. నిషేధిత ఆయుధాలైన కత్తులు, చాకులు, కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాలకు పురిగొల్పే ఆయుధాలను వాడకూడదని చెప్పారు. భారీగా జనసమూహాన్ని పోగుచేసే సమావేశాలు, లౌడ్ స్పీకర్లు, డీజెలపై కూడా నిషేధం ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని తెలిపారు. అందరూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా చర్యలకు సహకరించాలని డిఎస్‌పి తెలిపారు.

మండలం అక్షరాస్యతలో ముందుండాలి : పీడీ

ప్రజాశక్తి - గణపవరం

మండలాన్ని అక్షరాస్యతలో జిల్లాలోనే ముందుంచాలని డ్వామా పీడీ మల్లికార్జున రావు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక మండలపరిషత్ భవనంలో జరిగిన ఉల్లాస్ అక్షరాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్ఆర్ఇ జిఎస్‌లో ఉన్న నిరక్షరాస్యులైన వారిని గుర్తించి వారికి చదువు నేర్పించాలని అన్నారు. డ్వామా గ్రూపులలో వెయ్యి మంది నిరక్షరాస్యులను గుర్తించి ప్రతి పది మంది లెర్నర్‌లకు ఒక్కొక్క వాలంటీర్లను ఏర్పాటు చేయటం జరుగుతుందని చెప్పారు. మండలంలో వందమంది వాలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంఇఒ జి.బాలయ్య, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సేవా మూర్తి మదర్ థెరిస్సా

తణుకు : సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం

గణపవరంలో వృద్ధులకు పళ్లు పంపిణీ

ఘనంగా పలుచోట్ల జయంతి వేడుకలు

ప్రజాశక్తి - తణుకు

మదర్ థెరిస్సా అందించిన వైద్యసేవలు, చూపిన ప్రేమ, ఆదరణ, ఆప్యాయతలు విశ్వమానవ జాతికే ఆదర్శమని డాక్టర్ ఆయేషాఖాన్ అన్నారు. మంగళవారం మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం ఉత్తమ వైద్య సేవలు అందజేసిన నర్సులను ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఉత్తమ వైద్య సేవలు అందజేస్తున్న నర్సులు, ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ మానుకొండ కృపావరం, స్టాఫ్ నర్సులు ఎరిచర్ల దయావతి, పుష్పాల సురేఖలను శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు డాక్టర్ హుస్సేన్‌అహ్మద్, ఉపాధ్యక్షులు నల్లజర్ల వెంకన్న, కార్యదర్శి ఎండి స్వాలిహ్, కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యులు పాల్గొన్నారు.

గణపవరం: మదర్ థెరిస్సా 115వ జయంతిని పిఎంపి అసోషియేషన్ ఆధ్వర్యాన కాశిపాడులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ ఆధ్వర్యాన స్థానికులకు తణుకు శ్రీభాను ఆసుపత్రి వైద్యులు ఎస్.జీవన్ రవితేజ, పిఎంపి డాక్టర్లు క్షత్రియ సేవాసమితి సహకారంతో ఉచిత వైద్య సేవలందించారు. జయంతి సభలో పాల్గొన్న డాక్టర్ రవితేజ మాట్లాడుతూ మదర్ థెరిస్సా చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి తెర్లి నాగరాజు, అసోషియేషన్ జిల్లా కార్యదర్శి సుభాష్ ఆదినారాయణ, జె.రమేష్ రాజు, ఆరోగ్య సబ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పిహెచ్‌సిలో ఉన్న రోగులకు మంగళవారం పళ్లు, పాలు, రస్కుల ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు, కోశాధికారి కె.మూర్తి పాల్గొన్నారు.

పెనుమంట్ర : సేవకు రూపం ఉంటే ఆరూపం మదర్ థెరిస్సా అవుతుందని ప్రముఖ సామాజిక సేవకులు డాక్టర్ కర్రి మురళీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మార్టేరు కోడేరు రోడ్డులోని నెగ్గిపూడిలో మదర్ థెరిస్సా హెల్పింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ సమాజ సేవకురాలు మదర్ థెరిస్సా జయంతి నిర్వహించారు. అనంతరం మట్టా రాముని సంస్థ తరపున డాక్టర్ కర్రి మురళీ శ్రీనివాసరెడ్డి, నక్కా నరేష్ కుమార్ దుస్సాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త వెలగల అమ్మిరెడ్డి, దళిత నాయకులు జాలెం చిన్న నెల్లి శ్రీనివాస్, పెదపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మదర్ థెరిస్సా 115వ జయంతి సందర్భంగా పెదమామిడిపల్లి గ్రామంలో మెగా పవర్ ఫ్యాన్స్ చేట్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో రాధాకృష్ణ నేత్రాలయ వైద్యశాల భీమవరం వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించి 200 మందికి పరీక్షలు చేశారు. వైద్యశిబిరంను రాష్ట్ర చిరంజీవి యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు, కె.అనంత కృష్ణమాచార్య చేతులమీదుగా ప్రారంభించారు. చేట్రోలు కృష్ణ మోహన్, పరిం వెంకట నవీన్, గోగులమఠం గణేష్, కడలి స్వామి వెంకటాద్రి, కొలుసు దుర్గ ప్రసాద్, ఇంటి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉండి : సేవకు ప్రతిరూపంగా మదర్ థెరిస్సా నిలుస్తారని ఉండి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.లక్ష్మి సునంద అన్నారు. మంగళవారం ఉండి పిహెచ్‌సిలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.లక్ష్మి సునంద, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, పి.రంగా ప్రసాద్ రాజు మాట్లాడారు. అనంతరం పిహెచ్‌సిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. గ్రామంలోని నిరాశ్రయులకు, వృద్ధులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సత్తి బ్రహ్మారెడ్డి, కన్నెగంటి రూత్ కళ, గాదిరాజు వెంకటేశ్వరరాజు, బుద్ధరాజు సుబ్బరాజు, చింతాడ మహేష్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : మదర్ థెరిస్సా పుట్టినరోజు వేడుకలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పిఎంజెఎఫ్ లయన్ మదన్మోహన్ అగర్వాల్, అనిత అగర్వాల్ మనవరాలు దావీక్ష అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా లయన్ మోహన్ అగర్వాల్ ఆర్థిక సహకారంతో గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పండ్లు పంచిపెట్టారు. ఉత్తమ సేవలు అందించిన స్టాఫ్ నర్సులు జి.శ్రీదేవి, జి.శ్యామల కుమారి, ఎ.రమాదేవిలకు బహుమతులు ప్రధానం చేశారు.

ఎల్ఇ పాఠశాలపై ఎంఎల్ఎ విమర్శలు తగవు

సర్పంచి తాడిపర్తి ప్రియాంక

పెనుమంట్ర : డిజిటలైజేషన్ రేషన్ కార్డుల పంపిణీలో భాగంగా పెనుమంట్ర గ్రామపంచాయతీ వద్ద జరిగిన సభలో పెనుమంట్ర ఎల్ఇ స్కూల్‌కి సంబంధించిన సమస్యను పరిష్కరించాలని ఉద్యమించిన వారిని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ పార్టీ పరంగా విమర్శలు చేయడం తగదని గ్రామ సర్పంచి తాడిపర్తి ప్రియాంక, భర్త వైసిపి నాయకులు ప్రసన్న కుమార్ మంగళవారం వాపోయారు. ఎల్ఇ స్కూల్‌లోని మూడు, నాలుగు, ఐదు తరగతులను, వేరే స్కూల్‌కి తరలించే క్రమంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇష్టం లేకుండా స్కూల్ కమిటీని తప్పుదోవ పట్టించిన వైనంపై పలు దఫాలుగా ఫిర్యాదు చేసి, ధర్నా నిర్వహించామన్నారు. దీనిలో భాగంగా ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ఇంటికి వెళ్లి, ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు వినతి పత్రం ఇవ్వడం కూడా జరిగిందని, అయితే కనీసం ఈ విషయంపై అప్పుడు స్పందించకపోగా, సభలో వైసిపి వారు రెచ్చగొట్టి చేయించారని, పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రయివేట్ స్కూలుకి పిల్లల్ని పంపించి చదివించడం లేదా, అర కిలోమీటర్ దూరంలో స్కూల్‌కి వెళ్లలేరా అని వ్యంగ్యంగా మాట్లాడడం పట్ల వారు నిరసన వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్

ప్రజాశక్తి - తణుకు

కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నిలుపుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద నిర్వహించిన సిఐటియు 4వ మహాసభకు ఎన్.ఆదినారాయణ బాబు, ఎం.మధు షీల అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో గడిచిన 3 సంవత్సరాల నుండి జరిగిన కార్యక్రమాలు కార్యదర్శి గుబ్బల గోపి వివరించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షులు ఎ.అజయ కూమరి మాట్లాడారు. పిఎల్.నర్సింహా రావు, పి.దక్షిణా మూర్తి, గార రంగారావు, వల్లూరి వెంకటేశ్వరావు, ఐద్వా కార్యదర్శి కె.నాగరత్నం, ఎం.రమేష్, శివ కుమార్, రవి రామకృష్ణ, ఎన్.చిన్నారావు పాల్గొన్నారు.

మొదటి పేజీ నుంచి

పండుగకు ధరాఘాతం..!

మిర్చి ధర కిలో రూ.180, పెసరపప్పు ధర కిలో రూ.120, వేపుడు శెనగపప్పు రూ.110, వెల్లుల్లి కిలో రూ.200కు చేరాయి. వంటనూనె ధర లీటర్ సన్‌ఫ్లవర్ రూ.126 పలుకుతుండగా, విజయ ఆయిల్ రూ.150, ఫ్రీడమ్ ఆయిల్ రూ.150 వరకూ పలుకుతున్నాయి. ఇతర నిత్యావసరాల ధరలు కిలో రూ.వందకుపైనే ఉన్నాయి. వంటగ్యాస్ 14 కిలోల సిలిండర్ ధర రూ.886 ఉండగా, ఇంటికి చేరేసరికి రూ.920 అవుతోంది. ధరల పెరుగుదలతో సామాన్యుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

పిండి వంట చేయాలంటే రూ. వేలల్లో ఖర్చు పెట్టాల్సిందే

పండుగకు పిండివంట చేయాలంటే రూ.వేలల్లో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కరోనా తర్వాత సామాన్యుల ఆదాయాలు భారీగా పడిపోయాయి. ధరలు మాత్రం విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో సామాన్యుల రోజువారీ జీవనం భారంగా మారింది. వినాయక చవితి వంటి ముఖ్యమైన పండుగలను సైతం ఆనందంగా జరుపుకోలేని పరిస్థితి ఏర్పడింది. తక్కువస్థాయిలో పిండివంట చేయాలని ఆలోచన చేసినా రూ.నాలుగైదు వేలు ఖర్చవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్య ప్రజానీకం అంత వెచ్చించలేని పరిస్థితి ఉంది. కుటుంబమంతా కష్టపడినా నెలకు రూ.20 వేలు రావడమే గగనంగా మారుతోంది. ఇంటి అద్దె కింద రూ.ఐదు వేలు, ఇంటి నిత్యావసరాలకు రూ.నాలుగు వేలు, కరెంటు, కేబుల్ బిల్లులు, పిల్లల స్కూల్ ఫీజులు, ఆసుపత్రి ఖర్చుల వంటివాటికే నెల సంపాదన చాలడం లేదు. అప్పులు చేస్తే తప్ప రోజులు గడవని పరిస్థితి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో పిండి వంటలు చేసే ప్రయత్నం కూడా జనం చేయడం లేదు. దీంతో సామాన్యుల ఇళ్లలో పండుగ కళ అనేది లేకుండాపోతుంది. ఉదయమే లేచి గుడికి వెళ్లొచ్చి ఎటువంటి ఆర్భాటాలు లేకుండా పండుగను ముగించేస్తున్నారు. కేంద్రంలో మోడీ వచ్చిన తర్వాత సామాన్య ప్రజానీకం బతుకులు పూర్తిగా తారుమారయ్యాయి. సామాన్య కుటుంబాల్లో అప్పుల భారం పెరిగిపోతుంది. చదువు, ఆరోగ్యం వంటి ఖర్చులు సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో గతంలో ఎంతో ఘనంగా జరుపుకునే పండుగలను సైతం సామాన్య ప్రజానీకం చేసుకోలేని దుస్థితి నెలకొంది. ధరలు తగ్గించేందుకు ప్రభుత్వాలు ఎటువంటి చర్యలూ తీసుకోకపోగా సామాన్యులపై విద్యుత్ అదనపు ఛార్జీలు భారాలు వంటివి అదనంగా వేస్తూ దుర్మార్గంగా ముందుకు సాగుతున్నాయి. మార్కెట్లో వస్తువులు సరిగా అమ్ముడుపోవడం లేదని వ్యాపారులు సైతం గగ్గోలు పెడుతున్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలి

ప్రయత్నాలను రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అభివృద్ధి మంత్రం కార్పొరేట్లకు సంపద కట్టబెట్టడానికే తప్ప, విశాఖ ఉక్కు గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ ముఖచిత్రంగా పవన్‌కళ్యాణ్ ఉంటూ ప్రశ్నించడానికి జనసేన పుట్టిందన్న ఆయన.. ప్రశ్నిస్తే అణచివేస్తాం అంటున్న బిజెపితో కలిసి విశాఖ ఉక్కు పరిశ్రమకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాడాల్సిన వైసిపి విఫలమైందని, ప్రజలిచ్చిన బాధ్యతను విస్మరించిందని తెలిపారు. ప్రజాక్షేత్రంలో ఆ పని సిపిఎం, వామపక్ష పార్టీలు మాత్రమే చేస్తున్నాయని అన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని, సొంత గనులను కేటాయించాలని, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా సైల్‌లో విలీనం చేయాలని, అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఈ నెల 28న విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ప్రతిజ్ఞ దినంగా జిల్లాలోని అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో విద్యుత్ పోరాట వేదిక ఆధ్వర్యంలో సదస్సులు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలోని భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎరువుల వ్యాపారుల దోపిడీని అరికట్టాలని, రైతులకు యూరియా సబ్సిడీ ధరకే అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, ఎం.నాగమణి, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, జిల్లా నాయకులు గుడిపాటి నరసింహారావు, కారం భాస్కర్, గుడెల్లి వెంకట్రావు, తామా ముత్యాలమ్మ, ఎం.సుధారాణి, ఎస్.మహంకాళిరావు, ఎ.శ్యామలారాణి, జి.సూర్యకిరణ్, పి.సూర్యారావు, నగర నాయకులు పంపన రవి, ఎం.ఇస్సాక్, కనకారావు జి.గోపి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఇటీవల మృతి చెందిన సిపిఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి సంతాపం తెలిపారు. సిపిఎం ఆగిరిపల్లి మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు మృతికీ సమావేశం సంతాపం తెలిపింది.

ఉన్నత విలువలు ప్రజాశక్తి సొంతం

ముందుకు సాగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రశంసించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిరంతరం పని చేయడం అభినందనీయమన్నారు. స్థానిక కలెక్టరేట్లో ప్రజాశక్తి దినపత్రిక 45వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కార మార్గాన్ని ఎంచుతూ ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. పత్రికా రంగం అంటేనే కత్తి మీద సాము లాంటిదని, 45 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అన్ని ఆటుపోట్లు తట్టుకొని నిలబడటం అభినందనీయమన్నారు. ప్రజాశక్తి పత్రిక రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పత్రిక యాజమాన్యానికి, సిబ్బందికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఒ నాగేశ్వరరావు, ప్రజాశక్తి జిల్లా మేనేజర్ పి.నారాయణరాజు, డివిజన్ ఆర్గనైజర్ జి.సాయి, జిల్లా విలేకరి ఉండ్రు నరేష్, వివిధ మండలాల విలేకరులు జి.వెంకన్న, బిఆర్‌వి.సత్యనారాయణ, టి.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం : విగ్రహాలు పంపిణీ చేస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

పలుచోట్ల మట్టి విగ్రహాల పంపిణీ

ప్రజాశక్తి - నరసాపురం

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను భక్తులు పూజించాలని నరసాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసిరాజు అన్నారు. నరసాపురం బస్టాండ్ ఎదురుగా ఉన్న చిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మట్టి వినాయక విగ్రహాలు, వ్రత పుస్తకాలు, గుడ్డ సంచులను భక్తులకు తహశీల్దార్ అయితం సత్యనారాయణతో పాటు ఆర్‌డిఒ దాసిరాజు పంపిణీ చేసి మాట్లాడారు. సాంప్రదాయబద్ధంగా గణేష్ చవితిని జరుపుకోవాలన్నారు. ప్యాస్టర్ ఆఫ్ ప్యారిస్, వివిధ రసాయన రంగులతో తయారు చేసిన వినాయకుని విగ్రహాలను కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను వినాయక చవితి పూజలో వినియోగించాలని భక్తులకు సూచించారు. తహశీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో వాతావరణంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, కాలుష్యం అధికంగా ఉండి అనారోగ్య వాతావరణం పెరిగిపోతుందన్నారు. పర్యావరణ సమతౌల్యానికి ప్రజలు కృషి చేయాలన్నారు. ఆదరణ ట్రస్ట్ ఛైర్మన్ బొడ్డు కృష్ణ భగవాన్, ప్రధాన కార్యదర్శి గంధం శ్రీరామకృష్ణ, సహాయ కార్యదర్శి ముద్రగళ్ల బాబు, డైరెక్టర్ నాగిడి రాంబాబులు మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా ఆదరణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజానికి ఉపయోగపడే అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. భాగస్వాములైన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మండలంలోని సీతారాంపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఎఐ అండ్ ఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సుమారుగా 2 వేలకు పైగా విగ్రహాలను తయారు చేసి కళాశాలలోని అందరికి పంపిణి చేశారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి పాల్గొన్నారు.

మొగల్తూరు : పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ సూచించారు. మొగల్తూరులోని ప్రధాన కూడళ్లలో వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హాని కలిగించే విగ్రహాలను మాని మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని కోరుతూ పాఠశాల స్కౌట్, గైడ్స్ విద్యార్థులు మంగళవారం ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సర్కార్ మాట్లాడుతూ వినాయక మట్టి ప్రతిమలను పూజించి నిమజ్జనం చేసిన సమయంలో పర్యావరణానికి హాని కలగదని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో సీనియర్ ఉపాధ్యాయులు అయ్యప్ప నాయుడు, గైడ్స్ కెప్టెన్ పద్మాంజలి విజయ్ కుమార్,

మొగల్తూరు : మట్టి విగ్రహాలతో విద్యార్థుల ర్యాలీ

విద్యార్థులు ఉన్నారు.

పాలకొల్లు రూరల్: పండుగల వల్ల మనకు మేలు జరగాలి కానీ కీడు జరగకూడదని శివదేవుని చిక్కాల కెవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాము అన్నారు. పాఠశాలలో విద్యార్థులచే మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని సృజనాత్మకత ప్రతిబింబించేలా మట్టి వినాయక విగ్రహాలను రూపొందించారు. పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం పి.రాము, రామన్, సుబ్రహ్మణ్య శాస్త్రి, వీరాస్వామి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉల్లంపర్రు మాంటిస్సోరిస్‌లో మట్టి వినాయక విగ్రహాల పోటీలను స్కూల్ ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీలకు విద్యార్థులు తయారు చేసిన సుమారు 400 విగ్రహాలు ప్రదర్శించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు, ప్రోత్సాహక సర్టిఫికేట్, జ్ఞాపికలు బహూకరించారు. యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ అధ్యక్షులు కానూరు ప్రభాకర్ రావు, వనిత క్లబ్ సభ్యులు డాక్టర్ మౌని, ఫెమిన క్లబ్ అధ్యక్షులు మీనా మణిదీప్తి బహుమతులు విద్యార్థులకు అందజేశారు.

నరసాపురం : మదర్ థెరిస్సా పుట్టినరోజు సందర్భంగా యుకెవిఎస్‌సి వనితా క్లబ్ ఇంటర్నేషనల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. పేదలకు భోజనం ప్యాకెట్లు పంచి పెట్టారు. ప్రెసిడెంట్ బండి స్వర్ణలత, సెక్రటరీ రంగినీడి భరణి, వైస్ ప్రెసిడెంట్ పుప్పాల ఉషాకమల, గంట వెంకటరమణ, చెన్నా లక్ష్మి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ నరసాపురం ఆధ్వర్యంలో మట్టి వినాయకుడి విగ్రహాలు పంపిణీ చేశారు. మట్టి ప్రతిమలు, వ్రతకల్పము పుస్తకాలు 300 మందికి ఉచితంగా పంచి పెట్టినట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఆత్మూరి రమ వివరించారు. అసిస్టెంట్ గవర్నర్ గన్నబత్తుల సత్యవతి, తోట శ్రీనివాస్ బాబు, తోట శ్రీధర్ సత్య పాల్గొన్నారు.

ఆచంట : వల్లూరు గ్రామంలో జనసేన ఆధ్వర్యాన వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి పగో జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడారు. జనసేన గ్రామ అధ్యక్షులు కడిమి ఉమామహేశ్వరస్వామి, జనసేన మండల ఉపాధ్యక్షులు, వల్లూరు సొసైటీ అధ్యక్షులు తోట ఆదినారాయణ, ఆచంట

పాలకొల్లురూరల్ : బహుమతులు అందుకున్న విద్యార్థులు

మండల సెక్రటరీ కాపవరపు రామకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా వినాయక చవితి పండుగను నిర్వహించుకోవాలని విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రజలను కోరారు. జనసేన యువ నాయకుడు తోటరాజ పుట్టినరోజు సందర్భంగా స్థానిక జనసేన కార్యాలయంలో మంగళవారం మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన వీర మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్ జాతీయ సేవా పథకం వాలంటీర్లు వినాయక చవితి సందర్భంగా 2000 పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులకు పంపిణీ చేశారు.

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో వినాయక చవితి సందర్భంగా కళాశాల విద్యార్థులకు ఏకో ఫ్రెండ్లీ(పర్యావరణహిత) వినాయక ప్రతిమల తయారీ, ప్రదర్శన పోటీని కళాశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. 300 మట్టి వినాయక విగ్రహాలను పాలకొల్లు పుర ప్రజలకు అడబాల పెట్రోల్ బంకు దగ్గర పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

వ్యవసాయ సహాయ సంచాలకులు కె.ప్రతాప్ జీవన్

ప్రజాశక్తి - ఉండి

నిల్వలను చూస్తున్న అధికారులు

యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు కె.ప్రతాప్ జీవన్ అన్నారు. మంగళవారం ఉండి గ్రామంలోని మౌనిక ఫెర్టిలైజర్స్, సద్గురు ఆగ్రో కెమికల్స్, ఉండి విశాల సహకార పరపతి సంఘంలోని ఎరువుల దుకాణాలను స్థానిక మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కె.ప్రతాప్ జీవన్ మాట్లాడుతూ మండలంలో సుమారు 100 టన్నుల వరకు యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులెవ్వరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని అన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని దుకాణదారులకు సూచించారు. కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించి తగినంత నిల్వలు ఉన్నాయని అన్నారు. స్టాకు రికార్డులను పరిశీలించారు. ఈపాస్ యంత్రాలు గత మూడు రోజులుగా పనిచేయకపోవడంతో ఉన్న వ్యత్యాసాలను వెంటనే సరి చేయాలని దుకాణదారులకు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డిప్యూటీ స్పీకర్‌కు వినతి

ప్రజాశక్తి - కాళ్ల

ఎంఎల్‌ఎతో ఎస్‌టియు నేతలు

ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎఫ్‌టియు జిల్లా నాయకులు డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘు రామకృష్ణరాజుకు విన్నవించారు. మంగళవారం పెదఅమిరంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు ఎఫ్‌టియు జిల్లా శాఖ పక్షాన పుష్పగుచ్ఛం అందజేశారు. వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పెన్మెత్స ఆర్‌విఎస్.సాయివర్మ జిల్లాలోని ఉపాధ్యాయుల ముఖ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌టియు ఆకివీడు మండల నాయకులు నాగరాజు, జిల్లా కార్యదర్శి తోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

ఎంఎల్‌ఎ రాధాకృష్ణ

తణుకు : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ భరోసా ఇచ్చారు. మంగళవారం తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల పరిధిలో ముంపునకు గురైన వరి చేలను పరిశీలించిన అనంతరం రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నియోజవర్గంలో మొత్తం 300 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయాధికారులు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఇప్పటికే మంత్రి అచ్చెంనాయుడుతో పాటు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో మాట్లాడి రైతులకు అన్ని రకాలుగా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

భాష్యంలో వినాయక చవితి వేడుకలు

పెనుగొండ : భాష్యం పాఠశాలలో వినాయక చవితి వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినాయకుడి వేషధారణతో పాటు వ్రతకథపై నాటికలు, భక్తి గీతాలు ప్రదర్శించి అందరినీ అలరించారు. ప్రిన్సిపల్ ఎన్‌వి.అప్పారావు మాట్లాడుతూ మట్టి వినాయకున్నే పూజించాలని సూచించారు.

కొండెక్కిన పండుగ సామాను ధరలు..!

ప్రజాశక్తి - ఉండి

రద్దీగా ఉన్న మొగల్తూరు సెంటర్

వినాయక చవితి పండుగ పురస్కరించుకుని పూల ధరలకు రెక్కలు వచ్చాయి. ఉండిలో కేజీ రూ.600 వరకు చామంతి పూల ధరలు పలికాయి. పాలవెల్లి సామాను ధరలు కూడా అదే రీతిలో సామాన్యునికి అందకుండా కొండెక్కడంతో సామాన్య మానవునికి చుక్కలు కనపడ్డాయి. వెలగ మారేడు ధరలు రూ.40 వరకు ఉండగా బత్తాయి, నారింజ, మొక్కజొన్న, యాపిల్, దానిమ్మ ధరలు కూడా వాటితో పోటీ పడ్డాయి. స్వామివారికి సమర్పించే పత్రి సైతం రూ.50 వరకు ఉండడంతో వినాయక చవితి పండుగ సామాన్యునికి బరువైందని పలువురు వాపోతున్నారు. దీంతో వ్యాపారాలు అంతంత మాత్రంగానే సాగాయి. దుకాణాలు సైతం జనం లేక వెల వెలబోయాయి.

మొగల్తూరు : మండల కేంద్రం మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతం ప్రజలతో రద్దీగా మారింది. పూలు, పళ్లకు ధరలను గతంతో పోలిస్తే 50 శాతం పెరిగాయని దుకాణదారులు వాపోతున్నారు. దీంతో అధిక ధరలతో ప్రజలు బెంబేలెత్తారు. చేసేదేమీ లేక వినియోగదారులు నామమాత్రంగానే కొనుగోలు చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

నరసాపురం : పట్టణంలోని తెలగ కళ్యాణ మండపంలో లబ్ధిదారులకు క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులను ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ పంపిణీ చేశారు. పారదర్శకతతో మెరుగైన సేవలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నియోజకవర్గంలో బొమ్మిడి నాయకర్ లబ్ధిదారులకు అందజేశారు. టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, తహశీల్దార్ అయితం సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరవాసరం : పౌరసరఫరాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా కూటమి ప్రభుత్వం ఆలోచనతో స్మార్ట్ రేషన్ కార్డును రూపకల్పన చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నారని ఎంపిపి వీరవల్లి దుర్గ భవాని చంద్రశేఖర్ అన్నారు. తోడేరులో మంగళవారం స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. తహశీల్దార్ ఎవి.రామాంజనేయులు, సర్పంచి వేండ్ర వెంకట లీలాకృష్ణ, ఎంపిటిసి గుల్లిపల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎంపిడిఒల సమస్యలపై వినతి

ఆచంట : ఎంపిడిఒలకు సచివాల సిబ్బంది కొరతతో పాటు వివిధ శాఖల సర్వే కార్యక్రమాలు భారంగా మారాయని జిల్లా ఎంపిడిఒల సంఘం అధ్యక్షులు బిఎస్‌ఎస్.కృష్ణమోహన్ అన్నారు. జిల్లాలో ఎంపిడిఒలు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలపై నియోజకవర్గ ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణకు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలి

ఆచంట : భీమవరం ఆర్‌టిసి డిపో నుంచి నియోజకవర్గ కేంద్రమైన ఆచంటకు బస్సులు ఏర్పాటు చేయాలని ఎంపిటిసి బాలం లీలా సుబ్రహ్మణ్యం, సర్పంచి అల్లం పద్మావతి ఆర్‌టిసి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి ఉన్నారు.

పత్రులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పూజా పత్రుల పంపిణీ

కాళ్ల : స్వాతంత్ర సమరయోధులు మంతెన వెంకట సూర్యనారాయణ రాజు, సుభద్రాయమ్మ పేరు మీద ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తున్నామని ఛైర్మన్ మంతెన వెంకట రవివర్మ అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో వినాయక చవితి పూజాపత్రులు ఉచితంగా మంగళవారం పంపిణీ చేశారు. మంతెన వెంకట సూర్యనారాయణ రాజు, సుభద్రాయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏలూరుపాడు రవివర్మ తోటలో వినాయక చవితి పురస్కరించుకుని సూర్యనారాయణరాజు మనవరాళ్లు మంతెన హిమదుర్గ, డాక్టర్ మంతెన ఉమా శ్రీలక్ష్మి ఆధ్వర్యాన 20 రకాల పూజా పత్రులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మంతెన ఉమాశ్రీ లక్ష్మి, మంతెన హిమ దుర్గ పాల్గొన్నారు.

పనులు నాణ్యంగా ఉండాలి

జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వివి.గిరి

తాడేపల్లిగూడెం : చేసే పనులు నాణ్యతతో చేస్తేనే నాలుగు కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా ఉంటాయని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వివి.గిరి పేర్కొన్నారు. మండలంలోని బంగారు గూడెంలో ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఐరన్‌తో కట్టుబడిన పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిర్మాణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని డిఇ సోమేశ్వరరావు, ఎఇ రాజా శ్రీనివాస్‌లకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా దేవానంద్‌కుమార్

ప్రజాశక్తి - మండవల్లి

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మండవల్లికి చెందిన మెండ దేవానంద్‌కుమార్ ఎంపిక య్యారు. మన దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 21 మందికి జాతీయస్థాయి బెస్ట్ టీచర్ అవార్డులను భారతదేశ ఉన్నత విద్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. వీటిలో మండవల్లికి చెందిన డాక్టర్ మెండ దేవానంద్ కుమార్ జాతీయస్థాయిలో 19వ స్థానంలో నిలిచారు. సెప్టెంబర్ 5న న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా దేవానంద్‌కుమార్ అవార్డును అందుకోనున్నారు. 2024లో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖామంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కూడా దేవానంద్‌కుమార్ పొందారు. మండవల్లిలో విద్యభ్యాసం చేసి ఉన్నత స్థాయికి ఎదిగి అవార్డులు పొంది మండవల్లి గ్రామానికి కీర్తి ప్రతిష్టలు గుర్తింపు తీసుకొచ్చిన డాక్టర్ దేవానంద్ కుమార్‌కు గ్రామ సర్పంచి దంపతులు మెండ ఝాన్సీ సురేష్‌బాబుతోపాటు గ్రామస్తులు, స్నేహితులు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా కలెక్టరేట్ భీమవరంలోనే ఉండాలి

వైసిపి నియోజకవర్గ కన్వీనర్ వెంకటరాయుడు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా కలెక్టరేట్ భీమవరంలోనే కొనసాగాలని, తరలించాలని చూస్తే ఉద్యమం చేపడతామని వైసిపి భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు అన్నారు. మంగళవారం రాయలంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వెంకటరాయుడు మాట్లాడుతూ ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కలెక్టరేట్‌ను భీమవరం నుండి తరలించాలని చూస్తున్నట్లు తెలుస్తోందని, దీనిపై స్థానిక ఎంఎల్‌ఎ, కేంద్ర మంత్రి స్పందించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తక్షణమే ఎంఎల్‌ఎ అంజిబాబు, కేంద్ర మంత్రి వర్మ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత వైసిపి ప్రభుత్వం అందరితో చర్చించి, ఆలోచించాకే అందరికీ అందుబాటులో ఉండేలా జిల్లా కేంద్రంగా భీమవరం పట్టణాన్ని ఎంపిక చేశారన్నారు. జిల్లా కేంద్ర భవనాల నిర్మాణానికి మార్కెట్ యార్డులో 20 ఎకరాల భూమి కేటాయించి, రూ.100 కోట్లు నిధులను కేటాయించారని తెలిపారు. భీమవరంలోనే కలెక్టరేట్ కొనసాగాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కౌరు శ్రీనివాసరావు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్‌పిటిసి కాండ్రేకుల నరసింహారావు, జిల్లా మహిళాధ్యక్షులు కోడె విజయలక్ష్మి, పార్లమెంట్ అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, నాయకులు కోడె యుగంధర్, ఎస్.రాజు, జిల్లా కొండయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదఅమిరంలో కలెక్టరేట్ నిర్మాణానికి అడ్డుపడొద్దు

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

జిల్లా నూతన కలెక్టరేట్ నిర్మాణంపై కొందరు రాద్ధాంతం చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం పెదఅమిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టరేట్ ఆఫీస్ అద్దె భవనంలోనే కొనసాగుతుందన్నారు. భీమవరం మార్కెట్ యార్డులో కలెక్టరేట్‌కు స్థలం ఇచ్చారని, అయితే అది ముందుకు వెళ్లలేదని చెప్పారు. కలెక్టరేట్‌ను ఉండి తరలించుకపోతున్నామని చెబుతున్నవారికి కార్ల షోరూములూ, కృషి విజ్ఞాన కేంద్రం, ఐటిఐ అన్నీ పెదఅమిరంలోనే ఉన్నాయని, అయితే వాటిని భీమవరంలో వాటిగానే పరిగణిస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ.100 కోట్లు పెట్టి స్థలం కొని, మరో రూ.60 కోట్లు ఖర్చు చేసి కలెక్టరేట్ కట్టడం కష్టమన్నారు. తన దృష్టిలో భీమవరం, ఉండిలను వేర్వేరుగా చూడటం లేదన్నారు. పెదఅమిరం గ్రామాన్ని భీమవరం మున్సిపాలిటీలో కలపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కలెక్టరేట్ నిర్మాణానికి రూ.70 కోట్లు అయితే రూ.35 కోట్లు ప్రభుత్వం ఇస్తుందని, మిగిలిన రూ.35 కోట్లు తాము సమకూర్చి సుమారు 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని హంగులతో కలెక్టరేట్‌ను నిర్మించాలనేది తమ కోరిక అన్నారు. కలెక్టరేట్‌కు, భీమవరం వారి మనోభావాలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. సిఎం చంద్రబాబు పి-4కు తాను పూర్తిగా ఆకర్షతుడినై పనులు చేస్తున్నానని, ఇదే విషయాన్ని ముఖ్యమంత్రికి తెలిపి ఆహ్వానించానని స్పష్టం చేశారు. తాను చేయాలనుకున్న మంచిని మిగిలిన ఎంఎల్‌ఎల అనుమతితో చేయాల్సిన అవసరం తనకు లేదని అన్నారు.

కలెక్టరేట్ తరలిస్తే ఉద్యమమే

కాంగ్రెస్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఏడు నియోజకవర్గ ప్రజలకు అనుకూలంగా ఉన్న భీమవరం జిల్లా కలెక్టరేట్‌ను వేరేచోటకు తరలించాలని చూస్తే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ అంకెం సీతారాం అన్నారు. మంగళవారం స్థానిక ప్రకాశం చౌక్‌లో కలెక్టరేట్ తరలింపుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఉండి ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు భీమవరం కలెక్టరేట్ పెదఅమిరంలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం బాధాకరమన్నారు. కలెక్టరేట్‌పై తక్షణం స్పష్టతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

28న నిరసనలు

వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమ అమర వీరుల దినం సందర్భంగా ఈ నెల 28న నిరసన కార్యక్రమాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని జిల్లా, పట్టణ, మండల కేంద్రాల్లో నిర్వహించాలని వామపక్షాల నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఐఎఫ్‌టియు జిల్లా కార్యాలయంలో వామపక్షాల సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రవితోపాటు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడుతూ 2000వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపితే వామపక్ష పార్టీలు సాగించిన పోరాట సందర్భంగా ఆగస్టు 28న బషీర్‌బాగ్ కాల్పుల్లో ముగ్గురు అమరులయ్యారన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును విరమించుకోవాలని, ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో భారాలు మోపి ప్రజలపై మోపిన భారాలు ఉపసంహరించాలని కోరారు. ఈ నెల 28న నిరసన, ప్రతిజ్ఞ పిలుపునిచ్చినట్లు తెలిపారు. 28వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు ఏలూరు పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించాలని, జిల్లాలో అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో నిరసన, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో సిపిఐ నేతలు బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమశంకర్, సిపిఎం నేతలు పి.రామకృష్ణ, పంపన రవికుమార్, ఎం.ఇస్సాక్, జె.గోపీ తదితరులు పాల్గొన్నారు.